సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

క్షయ బాధితులకు ఆహార కిట్ల పంపిణీ

ఆరిలోవ: ఆరిలోవలో జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ యూనిట్(ఎఫ్ఆర్‌యూ)లో క్షయ బాధితులకు రెండు రోజులుగా పౌష్టికాహారంతో కూడిన కిట్లు పంపిణీ చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన టీబీ యూనిట్‌లో సుమారు 60 మంది టీబీ రోగులున్నారు. వారికి ఇక్కడ ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు అందిస్తున్నారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం, ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా టీబీ రోగులు త్వరగా కోలుకోవడానికి పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ అనిత పలువురు రోగులకు ఆహార కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీ విభాగం సిబ్బంది లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో ఫాగింగ్


మద్దిలపాలెంలో ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ మలేరియా సిబ్బంది

మద్దిలపాలెం: దోమల నివారణకు సాయంత్రం వేళలో జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది ముమ్మరంగా ఫాగింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలో సోమవారం మినీ ఫాగింగ్ నిర్వహించారు. కాలనీలో దోమల నివారణకు కాలనీ వాసులు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పందిరి రాట

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులో దుర్గాదేవి నవరాత్రి వేడుకల్లో భాగంగా సోమవారం భక్తిశ్రద్ధలతో పందిరి రాట వేశారు. ముఖ్యఅతిథిగా పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్ పీతల గోవింద్ దంపతులు పాల్గొ ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం


విద్యార్థులు ప్రదర్శించి పోషకాహార పదార్థాలు

ఎంవీపీ కాలనీ: స్థానిక సమత కళాశాలలో సోమవారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల డీన్ ఆచార్య విజయరవీంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని ఆహార పదార్థాల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా పోషకాహార లోపం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది మరణిస్తున్నారన్నారు. పోషకాహారం ప్రతి ఒక్కరికీ అందాలనే సంకల్పంతో ఐక్యరాజ్య సమితి ఏటా అక్టోబర్ 16న ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాల స్టాల్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులను హరించేందుకే ప్రైవేటీకరణ

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల, ఉక్కు భూనిర్వాసితుల హక్కులను హరించేందుకే స్టీల్‌ప్లాంట్ పరిశ్రమను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్రప్రభుత్వం పావులు కదుపుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 977వ రోజు సోమవారం, స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు అటువంటి పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికులు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

జగనన్న ఆరోగ్య సురక్ష.. పేదలకు రక్ష

- ప్రత్యేక వైద్య శిబిరాలకు విశేష ఆదరణ
- స్పెషలిస్ట్ వైద్యులతో పరీక్షలు.. మందుల పంపిణీ


13వ వార్డు యూపీహెచ్‌సీలో రోగులను పరిశీలిస్తున్న వైద్యురాలు


11వ వార్డులో మహిళలకు కంటి పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది


11వ వార్డు యూపీహెచ్‌సీలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆరిలోవ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నాయి. స్పెషలిస్ట్ వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు చేయడంతో విశేష ఆదరణ పొందుతున్నాయి. పేదల ఆరోగ్యమే ధ్యేయంగా ఈ శిబిరాలు కొనసాగుతున్నాయి. తూర్పు నియోజకవర్గంలో ఈ నెల 7 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు కొనసాగుతున్నాయి. ఆరిలోవతో పాటు మద్దిలపాలెం, ఇసుకతోట, పెదవాల్తేరు ప్రాంతాలలో ఉన్న ఏడు యూపీహెచ్‌సీలలో జరుగుతున్న ఈ శిబిరాలకు రోజూ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలు పొందుతున్నారు. యూపీహెచ్‌సీల్లో ఉన్న జనరల్, ఆర్థోపెడిక్, గైనిక్, దంత, చర్మ వ్యాధులకు సంబంధించిన ఐదుగురు స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. అవసరమైతే రోగులకు రక్త పరీక్షలు, బీపీ, మధుమేహం, టీబీ తదితర పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందిస్తున్నారు. ఇంటికి సమీపంలోనే ఉచిత వైద్యం, మందులు అందడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

11, 13 వార్డుల్లో ఆరోగ్య సురక్ష శిబిరాలు

జీవీఎంసీ 11, 13 వార్డుల్లోని యూపీహెచ్‌సీలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. 11వ వార్డు బాలాజీనగర్ యూపీహెచ్‌సీలో 20వ సచివాలయం, 13వ వార్డు ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ యూపీహెచ్‌సీలో 6వ సచివాలయం పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ 13వ వార్డులో స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మితో కలసి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఇక్కడ అందుబాటులో ఉన్న మందులు, చేస్తున్న రక్త పరీక్షలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శించిన పౌష్టికాహారాన్ని సునీత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


జీవీఎంసీ 13వ వార్డులో వృద్ధురాలికి ఆరోగ్య సురక్ష కార్డు అందజేస్తున్న కార్పొరేటర్ సునీత

- జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్ యూపీహెచ్‌సీలో 20వ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన శిబిరంలో కంటి వైద్యులు, జనరల్, గైనిక్, చర్మ, దంత వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. బాలాజీనగర్ యూపీహెచ్‌సీలో 168 మంది, ఆరిలోవ కాలనీ యూపీహెచ్‌సీలో 190 మంది వైద్య సేవలు పొందినట్టు ఆయా యూపీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ కిరణ్ లలితా దేవి, డాక్టర్ సుమన్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, వెంకటరెడ్డి, దుర్గారావు, జీవీఎంసీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్

మద్దిలపాలెం: నేవీ స్కూల్ విద్యార్థులు మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో సోమవారం ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనం అలవర్చుకోవాలని సూచిస్తూ చేసిన డ్యాన్స్ ఆకట్టుకుంది. విశాఖలో నవంబర్ 5న జరిగే నేవీ మారథాన్, నేవీ డే వేడుకల్లో భాగంగా ఈ ఈవెంట్‌ను నిర్వహించినట్టు విద్యార్థులు తెలిపారు. నేవీ మారథాన్‌లో ఫుల్ మారథాన్ 42.2 కిలోమీటర్లు కాగా, హాఫ్ మారథాన్ 21.1 కిలోమీటర్లు, 10కే రన్, 5కే రన్ నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు https://www.vizagnavymarathon.run/లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.


ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తున్న నేవల్ స్కూల్ విద్యార్థులు

బుల్లయ్య కళాశాల విద్యార్థులకు పతకాలు

సీతంపేట: సమ్యుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఇటీవల నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో డాక్టర్ బుల్లయ్య కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. బీఎస్సీ విద్యార్థిని ఎం.లక్ష్మితారెడ్డి ఉమెన్స్ ఇన్‌లైన్ స్పీడ్ స్కేటింగ్‌లో, కరాటేలో బంగారు పతకాలు సాధించింది. బీఏ విద్యార్థి బి.ప్రవీణ్‌కుమార్ మెన్ బాక్సింగ్ 57 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని గెలుపొందాడు. ఈ సందర్భంగా సోమవారం వీరిని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు.

తొలగించిన చెట్లకు పునర్జన్మ

ఏయూ క్యాంపస్: తొలగించిన చెట్లకు తిరిగి ప్రాణం పోస్తున్నారు విశాఖలోని మహానగర పాలక సంస్థ అధికారులు. ఇటీవల కాలంలో పోలమ్మ గుడి నుంచి ప్రభుత్వ మానసిక ఆరోగ్య కేంద్రం కలుపుతూ వీఎంఆర్‌డీఏ పార్క్ వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు. ఇలా సోమవారం ఉదయం మెంటల్ హాస్పిటల్ జంక్షన్ నుంచి వీఎంఆర్‌డీఏ పార్కు వరకు రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న చెట్లను క్రేన్లతో జాగ్రత్తగా బయటకు తీశారు. వెంటనే చెట్ల వేళ్లకల, ఎండిపోకుండా గోనె సంచి చుట్టి నీళ్లతో తడుపుతున్నారు. ముందుగా తీసి ఉంచిన గోతుల్లో వాటిని జాగ్రత్తగా పెట్టి మళ్లీ జీవం పోస్తున్నారు, రాణి చంద్రమణి హాస్పిటల్ దగ్గర తొలగించిన చెట్టుకు పునర్జన్మనిచ్చారు.


చెట్లను తరలిస్తున్న సిబ్బంది

అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరి


కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న కన్యాపూజకు వస్తున్న కన్యలు


అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరి

- అమ్మవారికి 102 మంది కన్యల పూజలు
- కలశాలతో యువతుల ప్రదక్షిణ

దాబాగార్డెన్స్: కన్యకాపరమేశ్వరి అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కురుపాం మార్కెట్ సమీపంలోని ఆలయంలో అమ్మవారిని బియ్యం బస్తాలతో అలంకరించారు. కంకటాల కృష్ణారావు, కుమారి దంపతులు, వారి కుమారులు సతీష్, నవీన్‌కుమార్ ఈ బియ్యం బస్తాలను అందించారు. ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.


నేత్రపర్వంగా కన్యల పూజ

సంప్రదాయ వస్త్రాలను ధరించిన 102 మంది కన్యలతో అమ్మవారికి కన్యాపూజ జరిపించారు. పూజ అనంతరం కన్యలు అందరూ శుద్ధ జలంతో కూడిన కలశాలతో గ్రామ ప్రదక్షిణ చేశారు. దేవాలయం నుంచి పప్పుల వీధి, శివాలయం వీధి మీదుగా అమ్మవారి ఆలయం వరకు ప్రదక్షిణ సాగింది. సాయంత్రం పెన్నం వెంకటరత్నం నేతృత్వంలో సౌందర్యలహరి గ్రూప్‌చే భాగవతం కార్యక్రమం నిర్వహించారు.ఆరిశెట్టి దినకర్, గ్రంధి రామకృష్ణారావు, పూసర్ల సురేష్‌కుమార్, సుగ్గు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

ఆచార్యుల పరిశోధనకు సహకారం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సోమవారం నిర్వహించిన ఒక రోజు సదస్సును వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. బీఐఎస్‌తో చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా తొలి సదస్సును నిర్వహిస్తున్నామని వీసీ తెలిపారు. బీఐఎస్ ఏయూలో చెయిర్ ప్రొఫెసర్‌ని ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా విద్యార్థులకు మరింత ఎక్కువగా సేవలను అందిస్తూ, చేరువ చేయడం జరుగుతుందన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు మాట్లాడుతూ వస్తువులు, ఉత్పత్తులను ప్రామాణీకరించడం తదితర అంశాలను వివరించారు. బీఐఎస్ టెక్స్‌టైల్ విభాగం సీనియర్ డైరెక్టర్ జె.కె.గుప్త మాట్లాడుతూ ఆచార్యులు చేసే పరిశోధనలకు సహకారం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బీఐఎస్ శాస్త్రవేత్తలు టి.సుజాత, మనోజ్‌కుమార్ రాజక్, వైభవ్ జిందాల్, శుభం యాదవ్, ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి, అడ్జంక్ట్ ప్రొఫెసర్ ఎస్.లక్ష్మీనారాయణ, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న బీఐఎస్ ప్రతినిధులతో వీసీ ప్రసాదరెడ్డి

● సీఎం వైఎస్ జగన్‌కు ఆత్మీయ స్వాగతం



విశాఖ పర్యటన నిమిత్తం సోమవారం నగరానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి

సంక్షేమ పాలనకు భయపడే ఆరోపణలు

- ప్రతిపక్షాలపై వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ ధ్వజం
- 13వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం


శ్రీకృష్ణాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు

ఆరిలోవ: ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్నందుకే ప్రతిపక్షాలు భయపడి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ధ్వజమెత్తారు. జీవీఎంసీ 13వ వార్డులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంవీవీ వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలసి శ్రీకృష్ణాపురంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ఎంతెంత లబ్ధి పొందారో తెలుసుకున్నారు. కాలనీలో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా సచివాలయం సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని కాలనీవాసులకు సూచించారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఎంపీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా చేరుతున్నాయన్నారు. టీడీపీలో మాదిరిగా దళారులు పాత్ర పోషించే జన్మభూమి కమిటీలు ఇక్కడ లేవన్నారు. టీడీపీ కల్లిబొల్లి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, వెంకటరెడ్డి, భాస్కర్, బాబూరావు, గోవింద్, వీర్రాజు, శిరీషా, శ్రీనివాస్, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత

ఎంవీపీ కాలనీ: బాల్య వివాహ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభారాణి కోరారు. సోమవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో ప్రతిజ్ఞ పేరిట స్వయం సహాయక సంఘాల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా ఏపీని నిలపడంలో స్వయం సహాయక సంఘాలు ప్రత్యేక పాత్ర పోషించాలన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేయడం వల్ల కలిగే అనర్థాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయకూడదన్నారు. బాల్య వివాహంలో పాల్గొనడం, ప్రోత్సహించడం చట్ట విరుద్ధమన్నారు. అమ్మాయిలను చదువు, ఉద్యోగ అవకాశాల్లో ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అభివృద్ధి అధికారి పూర్ణిమాదేవి, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శోభారాణి

ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ కనువిందు


పోలమాంబ ఆలయంలో అమ్మవారి దర్శనం


బాలా త్రిపుర సుందరిగా లలితాదేవి


నృత్యం చేసిన చిన్నారులతో ఈవో గాయత్రి, తదితరులు


పీతలవానిపాలెంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఏయూ క్యాంపస్: తూర్పు నియోజకవర్గంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. స్థానిక పోలమాంబ ఆలయంలో అమ్మవారు శ్రీబాలా త్రిపుర సుందరిదేవిగా సోమవారం దర్శనమిచ్చారు. ఉదయం భక్తుల గోత్ర నామాలతో కుంకుమ పూజలు, చండీ హోమం జరిపారు. ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా శ్రీవేంకట అన్నమాచార్య సేవ ట్రస్ట్ సభ్యులు కోలాటం ప్రదర్శించారు. సాయంత్రం జిల్లా బాల భవన్ బృందం సభ్యుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

- లలితా పీఠంలో రెండో రోజు సోమవారం తెల్లవారుజామున పంచామృతాభిషేకంతో కార్యక్రమాలను ప్రారంభించారు. సాయంత్రం శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి ఆవణార్చనతో శ్రీచక్రార్చన, నక్షత్ర దీపాలంకరణ సేవ, మంగళ హారతితో కార్యక్రమాలు వైభవంగా ముగిశాయి.


గాయత్రీ దేవిగా అలంకరించిన విజయదుర్గాదేవి

- పెదవాల్తేరు పోలమాంబ ఆలయంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం చిన్నారులకు ప్రశంసా పత్రాలను ఈవో కె.గాయత్రి అందజేశారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం కుంకుమ పూజలు చేశారు.

గాయత్రీదేవీ అలంకరణలో విజయదుర్గ

ఆరిలోవ: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హనుమంతవాక వద్ద విజయదుర్గా కాలనీలో విజయదుర్గా దేవి గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని హనుమంతవాక, విజయదుర్గా కాలనీ, సంజయ్‌గాంధీ కాలనీ, సింహగిరి కాలనీ, పెదగదిలి ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు.

మద్దిలపాలెం: పీతలవానిపాలెంలో కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారికి సోమవారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని గాజులతో అలంకరించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఎంవీపీ కాలనీ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. రూపా డాన్స్ అకాడమీ విద్యార్థులు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు.

ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం అధ్యక్షురాలిగా వసంతలక్ష్మి


వై.వసంతలక్ష్మి

అల్లిపురం: ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం విశాఖపట్నం అధ్యక్షురాలిగా న్యాయవాది వై.వసంతలక్ష్మి ఎన్నికయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో ఆదివారం జరిగిన సంఘం ఎన్నికల ఫలితాలను సంఘం కార్యదర్శి రాయి శ్రీనివాస, ఎన్నికల అధికారి కేపీ దేశాయ్ ప్రకటించారు. కార్యవర్గ సభ్యులుగా ఎం.వి.లక్ష్మి, కె.నాగకుమారి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బి.విజయకుమార్, పద్మాబాయ్, సంయుక్త కార్యదర్శులుగా వి.జాన్‌డేవిడ్‌రాజు, వి.నీలిమ, వై.శ్రీనివాసరావు, కోశాధికారిగా పి.ఆనంద్‌కుమార్‌తో సహా 11 మంది కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. నూతన కార్యవర్గానికి బార్ కౌన్సిల్ సభ్యులు బైపా అరుణ్‌కుమార్, సంఘం మాజీ అధ్యక్షుడు పాకా సత్యనారాయణ, హేమామాలిని, కేఎస్ సురేష్‌కుమార్, సాకా రాజేంద్రప్రసాద్, బలగ సత్యారావు, టి.సత్యారావు అభినందనలు తెలియజేశారు.

